## క్లుప్తంగా

### ముక్కంటి సేవలో తమిళనాడు అడిషనల్ డీజీపీ



ఆలయ ధ్వజస్తంభం వద్ద తమిళనాడు అడిషనల్ డీజీపీ హెచ్ఎం జయరామ్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం తమిళనాడు అడిషనల్ డీజీపీ హెచ్ఎం జయరామ్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకుడు లోకేష్ సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

### నాలుగు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

రేణిగుంట: మండలంలోని స్వర్ణముఖీ నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, 14.5 టన్నుల ఇసుకను శనివారం ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ సీఐ ఫణీంద్ర, ఎస్ఐ భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ చిరంజీవి, మహేష్ బృందం గాజులమండ్యం, పిల్లపాళెం ప్రాంతాల్లోని స్వర్ణముఖీ నది పరివాహక ప్రాంతంలో దాడులు చేశారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ట్రాక్టర్లను, ఇసుకను గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

### పౌష్టికాహారం కిట్ల పంపిణీ



విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ చేస్తున్న కరీముల్లా

రేణిగుంట: మండలంలోని తారకరామానగర్‌లో 25 మంది పేద విద్యార్థులకు శనివారం యువతేజం ట్రస్ట్ అధ్యక్షుడు కరిముల్లా పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కిట్లులో గోధుమ పిండి, రాగి పిండి, బెల్లం, రవ్వ, కందిపప్పు, ఎండు ద్రాక్ష, వేరుశనగ ముద్దలు, ఎండు ఖర్జూరం, బఠాణీ గింజలు, బిస్కెట్ ప్యాకెట్లు, కోడుగుడ్లు ఉన్నాయి. ట్రస్ట్ సభ్యులు హరి, కౌసల్య, సులోచన, అశ్విని పాల్గొన్నారు.


### న్యూమోనియాపై అవగాహన అవసరం



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న శాంతకుమారి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : ఐదేళ్లలోపు పిల్లల్లో వచ్చే ప్రాణాంతక న్యూమోనియాపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యునేజేషన్ అధికారిణి డాక్టర్ శాంతకుమారి తెలిపారు. ఆమె శనివారం తొట్టంబేడు మండలం కాసరం పీహెచ్‌సీ పరిధిలోని గుర్రప్పనాయుడు కండ్రిగలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. డాక్టర్ జుబేర్, సూపర్‌వైజర్ మురళి, ఎంపీహెచ్ఈఓ బాషా, పీహెచ్ఎన్ శాంతకుమారి పాల్గొన్నారు.

### గుండె పోటుతో వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి



కొండా మారయ్య(ఫైల్)

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని మేలచ్చూరు ఎస్టీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కొండా మారయ్య(59) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం పొలం పనులకు వెళ్లిన ఆయన ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు వాహనంలో ఆస్పత్రికి తీసుకెళుతుండగా మృతి చెందారు. ఆవిర్భావం నుంచి వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేశారని, ఆయన మృతి తీరని లోటని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ మండల కన్వీనర్ ఉబ్బర మనోహర్ ఆవేదన వ్యక్తం చేశారు.

### విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



గిరీష్‌కుమార్ (ఫైల్)

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. వీఎం.పల్లికి చెందిన గిరీష్‌కుమార్(33) బోనుపల్లి సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్ కొట్టింది. అతన్ని సిబ్బంది ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. గిరీష్‌కుమార్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలకు భద్రతేదీ?



ప్రహరీలేని వరదయ్యపాళెం ఎంపీడీవో కార్యాలయం



వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు భద్రత కరువైంది. కార్యాలయాలకు ప్రహరీ గోడలేక రాత్రి వేళ చీకటి కార్యకలాపాలకు కేంద్రంగా మారుతోంది. గతంలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ వరదయ్యపాళెం పట్టణంలో ఉండేవి. అయితే అద్దె భవనాల్లో ఉన్న కారణంగా ప్రభుత్వం సొంత భవనాలను నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో 2007లో ఇందిరా నగర్ సమీపంలోని తెలుగుగంగ కార్యాలయాల సముదాయంలో ఎంపీడీవో, తహసీల్దార్, స్త్రీశక్తి, వెలుగు, వ్యవసాయ, ఇరిగేషన్, హౌసింగ్ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించారు. అయితే భవనాలు నిర్మించి సుమారు 13 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ ప్రహరీ గోడ మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రభుత్వ పథకాలకు సంబంధించి విలువైన రికార్డులు, కంప్యూటర్లు కార్యాలయాల్లో ఉండడంతో వాటి భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఊరికి దూరంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల ప్రాంతం చీకటిపడితే అంధకారంగా మారుతోంది. కనీసం కార్యాలయాల ముందు విద్యుత్ దీపాలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో అక్కడ ఏమి జరిగినా ఎవరికీ తెలియని పరిస్థితి. అంతేకాక రాత్రి వేళల్లో మందుబాబుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. కనీసం వాచ్‌మెన్లు కూడా లేకపోవడంతో కార్యాలయాల లోపల ఏమి జరిగినా పట్టించుకునే పరిస్థితి లేదు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఖరీదైన జనరేటర్ ఉన్నప్పటికీ భద్రత లేదు. పగలు అర్జీదారులతో కళకళలాడే కార్యాలయాలు రాత్రి వేళ అంధకారంలో మగ్గుతున్నాయి.

**ప్రభుత్వానికి నివేదించాం**

శివారు ప్రాంతంలోని మండల పరిషత్, రెవెన్యూ, స్త్రీశక్తి, హౌసింగ్, వ్యవసాయశాఖ కార్యాలయాలన్నింటికీ ఒకే ప్రహరీ నిర్మించే విధంగా నిధులు మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదించాం. ఈ విషయమై ఉన్నతాధికారులతో సంప్రదించి శివారు ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు ప్రహరీ నిర్మిస్తాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.
–పద్మప్రియ, ఎంపీపీ, వరదయ్యపాళెం

## సమష్టి కృషితోనే బ్రహ్మోత్సవాలు విజయవంతం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- అధికారులు, సిబ్బందికి అభినందనలు

శ్రీకాళహస్తి రూరల్: అందరి సమష్టి కృషితోనే ముక్కంటీశుని బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కొనియాడారు. ఈ నెల 13 నుంచి 25 వరకు శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ధూర్జటి కళా ప్రాంగణంలో శనివారం అధికారులను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది దేశం నలుమూలలా చెప్పుకునే విధంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించామన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఏ ఏడాదికి ఆ ఏడాది రెట్టింపుగా ఉత్సవాలు నిర్వహించడానికి చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది 4 లక్షలు మంది భక్తులు శివరాత్రి రోజున స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారని తెలిపారు. గిరిప్రదక్షణకు లక్ష మందికి పైగా భక్తులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కొండ చుట్టూ ఇంకా కొంతభాగం రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉందని, అది కూడా పూర్తి చేస్తామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరా చేశారని తెలిపారు. పోలీసు శాఖ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించారని కొనియాడారు. ఆర్టీసీ అధికారులు భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి తమ వంతు కృషి చేశారని చెప్పారు. వైద్యశాఖాధికారులు ఆలయ ఆవరణలోనే ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి భక్తులకు వైద్య సేవలు అందించారని తెలిపారు. శివరాత్రి రోజు, లింగోద్భవ దర్శనం రోజు, దేవుని పెళ్లిరోజున భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్న ఏ భక్తుడుకి చిన్న ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవటం సంతోషమన్నారు. బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రజలు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

### ప్రజలు, న్యాయస్థానానికి వారధిలా పనిచేయాలి

శ్రీకాళహస్తి: పారా లీగల్ వలంటీర్లు ప్రజలు, న్యాయస్థానానికి వారధిలా పనిచేయాలని శ్రీకాళహస్తి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి తెలిపారు. ఆమె శనివారం పారా లీగల్ వలంటీర్లకు విధి విధానాలపై శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ న్యాయం అందేలా చూడాలన్నారు. లోక్ అదాలత్‌లో ఎలాంటి కేసులు జరుగుతాయి, వాటి పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు. న్యాయపరమైన సందేహాలు, సలహాల కోసం 15100కు కాల్ చేయాలని సూచించారు. న్యాయవాదులు రాజేశ్వరరావు, మల్లికార్జునయ్య, అరుణ్, సునీత, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

### భక్తులకు 300 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు



మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న స్కౌట్ అండ్ గైడ్స్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో 300 మంది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లు సేవలందించారు. క్యూలో భక్తులకు మంచినీటిని అందించడంతోపాటు రద్దీని క్రమబద్ధీకరించేందుకు తోడ్పాటు అందించారు. వృద్ధులు, వికలాంగులకు స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించారు. రథోత్సవం, తెప్పోత్సవం, కల్యాణోత్సవం, పల్లకీ సేవల్లోనూ సేవలందించారు. జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, బాబుఅగ్రహారం, భాస్కర్‌పేట, సరస్వతిబాయి మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల నుంచి 300 మంది స్కౌట్స్, గైడ్స్, రేంజర్స్, రోవర్స్ పాల్గొన్నారు. వీరి సేవలను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు, ఆర్డీవో రామారావు అభినందించారు. ఈ సేవా కార్యక్రమానికి రాష్ట్ర మండలి మాజీ సభ్యులు రమేష్‌బాబు పర్యవేక్షించారు.

### శివయ్యకు కళాకారుల నృత్యార్చన



ధూర్జటి కళావేదికపై కళాకారులు ప్రదర్శిస్తున్న నృత్య ప్రదర్శనలు

శ్రీకాళహస్తి రూరల్: ధూర్జటి కళాప్రాంగణంలో శనివారం కళాకారుల నృత్యాలతో శివభక్తిని ప్రదర్శించి భక్తకోటిని పరవశింపజేశారు. వీక్షకులను మంత్రముగ్ధులను చేశారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో వేద పండితులు సభ నిర్వహించారు. శ్రీ భవిరి రవి మిమిక్రీ కార్యక్రమం, హైదరాబాద్‌కు చెందిన మర్రి రమేష్ మాయాజాలం అహూతులను ఆకట్టుకుంది. కావలికి చెందిన శ్రీమేధా నృత్య కేతన్ లక్ష్మి సరయు నృత్య ప్రదర్శన, గొట్టిపూడికి చెందిన డి.అమరావతి ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం అలరించింది.

### గోడౌన్‌కు చేరిన రాగి పిండి, బెల్లం

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట సమీపంలోని ఎఫ్‌సీఐ గోడౌన్‌కు ఆదివారం రాగి పిండి, బెల్లం బస్తాలు వచ్చాయి. భగవాన్ సత్యసాయి బాబా కేంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారంగా రాగి పిండి, బెల్లం అందించనున్నారు. ఈ క్రమంలో 51 టన్నుల బెల్లం, 51 టన్నుల రాగిపిండి బస్తాలు వచ్చాయి. వీటిని త్వరలో పాఠశాలలకు తరలించనున్నట్లు మేనేజర్ శాస్త్రి చెప్పారు.

### భావనారుషి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం



నాగలాపురంలో పురవీధుల్లో ఊరేగుతున్న భద్రావతీ సమేత భావనారుషులు

పిచ్చాటూరు: నాగలాపురంలో వెలసిన భద్రావతీ భావనారుషుల బ్రహ్మోత్సవాలు శనివారంతో పరిసమాప్తం అయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో ఆఖరి రోజున స్వామివారి పులివాహనానికి మహానైవేద్యాన్ని సమర్పించారు. అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఉత్సవమూర్తులు పులివాహనంపై పురవీధుల్లో విహరించారు. భక్తులను కటాక్షిస్తూ కర్పూరనీరాజనాలు అందుకున్నారు. అనంతరం నిజాలయానికి చేరుకున్న ఉత్సవమూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు చేయగా, పులికి సంప్రదాయబద్ధంగా నైవేద్యం సమర్పించారు. ఏర్పాట్లను జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు జయపెరుమాళ్, స్థానిక సంఘం పెద్దలు పర్యవేక్షించారు.

### చురుగ్గా పారిశుద్ధ్య పనులు



మందును పిచికారీ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు, నెరిణికండ్రిగ, కారణి గ్రామాల్లో గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీ కాలువల్లోని మురుగును సిబ్బందితో తొలగించారు. వీధుల్లో నిల్వ ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. తాగునీటి ఓవరు హెడ్ ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమలు వృద్ధి కాకుండా తీసుకోవలసి చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

### 28న పిచ్చాటూరు మండల సమావేశం

పిచ్చాటూరు: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందన్నారు. దీనికి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, అందరు సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, అన్నీ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

## శంఖు చక్రాలకు అభిషేకం







శంఖు, చక్ర తిరునామాలకు పూజలు చేస్తున్న భక్తులు, హారతి ఇస్తున్న మహిళలు, అలంకరణలో శంఖు, చక్ర తిరునామం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలో శ్రీవేంకటేశ్వర దేవాలయంలోని శంఖు, చక్ర, తిరునామాలకు శనివారం గ్రామస్తులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. దేవాలయ శిఖరాలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చారు. కారణి, బుచ్చినాయుడుకండ్రిగ గ్రామాలకు చెందిన భక్తులు దేవాలయంలోని శ్రీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేసి పురవీధుల్లో ఊరేగించారు. శ్రీ వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకుందాం

– ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ బలపరిచిన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలుపించుకుందామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన శనివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ స్థాయి పట్టభద్రులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, నాయకు లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని గ్రామాలు, వార్డుల్లో తిరగాలన్నారు. పట్టభద్రులను కలిసి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించి ఓటు వేయాలని అభ్యర్థించాలన్నారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయం వ్యవస్థను తీసుకువచ్చి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. అలాగే పరిపాలనను ప్రజల ఇంటి వద్దకే తీసుకువచ్చారని పేర్కొన్నారు. పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన తనకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసేదానికి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉండవని, పేరు మాత్రమే ఉంటుందన్నారు. దానికి ఎదురుగా 1 అనే సంఖ్యకు మాత్రమే ఓటు వేయాలన్నారు. నాయకులు ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మిద్దెల హరి, ఉన్నం వాసుదేవనాయుడు, యాదవ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ ఈదుబోయిన లోకేష్‌యాదవ్, గున్నేరి కిషోర్‌రెడ్డి, జెడ్పీటీసీలు కాసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, మునిరత్నం, తిరుమలయ్య, హరిప్రసాద్‌రెడ్డి, గుమ్మడి బాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జిగా మిద్దెల హరి**

తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వైఎస్సార్ సీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మిద్దెల హరి వ్యవహరిస్తారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయనను ఇన్‌చార్జ్‌గా ప్రకటిస్తూ అందరికి పరిచయం చేశారు. మిద్దెల హరి మాట్లాడుతూ తన మీద నమ్మకంతో ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అత్యధిక మెజార్టీ తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు

## నయనానందకరంగా గజవాహన సేవ





గజవాహనంపై ఊరేగుతున్న స్వామివారు, వెండి పీటాన్ని సమర్పిస్తున్న భక్తుడు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి రూరల్: తొండమానుపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గజవాహన సేవ అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను మండపానికి వేంచేపు చేశారు. మధ్యాహ్నం పరిణయ మండపంలో స్వామి, అమ్మవార్లకు వసంతోత్సవం నిర్వహించారు. రాత్రి 7 గంటల నుంచి 8.30 మధ్య స్వామివారు గజ వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. చిత్తూరు శ్రీనివాసులు తమ తండ్రి జ్ఞాపకార్థం స్వామివారికి వెండి పీటాన్ని సమర్పించారు.

**నేడు చంద్రప్రభ వాహన సేవ**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం చంద్రప్రభ వాహనసేవ వైభవంగా జరగనుంది. రాత్రి 7 నుంచి 8.30 గంటల మధ్య స్వామి వారు చంద్రప్రభ వాహనంపై విహరించనున్నారు.

## ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవు



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

నారాయణవనం: కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే, వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర స్పష్టం చేశారు.సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సును న్యాయశాఖ స్థానిక పోలీసుల సహకారంతో నిర్వహించారు. దీనికి హాజరైన జడ్జి రాఘవేంద్ర మాట్లాడుతూ యుక్త వయసులో మానసికంగా, శారీకంగా ఎదుటివారిని ప్రేరేపించి వారిని మానసిక క్షోభకు గురిచేస్తే ర్యాగింగ్ చట్టం కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ర్యాగింగ్ నిరోధక చట్టాలను, శిక్షలను వివరించారు. చైర్మన్ అశోకరాజు, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దనరాజు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు




సత్యవేడులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రముని

వరదయ్యపాళెం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని తెలిపారు. మండలానికి సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికలకు శనివారం గోవర్ధనపురం హైస్కూల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పోలింగ్ సమయానికి అన్ని సదుపాయాలు కల్పించాలని మండల రెవెన్యూ యంత్రాంగాన్ని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ గౌరీశంకరరావు, సిబ్బంది ఉన్నారు.

సత్యవేడు: ఎమ్మెల్సీ ఎన్నికలు పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని తెలిపారు. ఆర్డీఓ సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేయనున్న మూడు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చి 13న నిర్వహించనున్న ఎన్నికలకు రెవెన్యూ డివిజన్ పరిధిలో కౌంటింగ్ పూర్తయ్యే వరకు కోడ్ అమలులో ఉంటుందన్నారు. నామినేషన్ల ఘట్టం పూర్తి కావడంతో పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, వసతులు పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు టివి. సుబ్రమణ్యం(సత్యవేడు), రవికుమార్(సూళ్లూరుపేట), డీటీ రవిచంద్ర, ఎస్ఐ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### గౌతమ్‌రెడ్డికి సాదర స్వాగతం



గౌతమ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ టీయూసీ నాయకులు

రేణిగుంట: వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డికి శనివారం రాత్రి రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మొదటి సారి తిరుపతికి వచ్చారు. ఆయనకు విమానాశ్రయంలో జిల్లా యూనియన్ నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు. యూనియన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చిన్న ఎల్లప్ప, యూనివర్సిటీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురళిరెడ్డి, సురేష్, మహేష్, రఫీ, తిరుమలరెడ్డి, జయన్న పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలని ఎంఈవో రవీంద్రనాథ్ స్పష్టం చేశారు. ఆయన శనివారం మండలంలోని నీర్పాకోట, కాంపాళెం, కుక్కంబాకం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని హెచ్చరించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.